TG/TEL/25/A3731

నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-261 | పేజీలు:-4 | శనివారం 05-09-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:261 | pages:04 | Saturday - 05-09-2026

మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్

- ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు.. అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు - మిగతా 2 లో

వందలాది చిన్నారుల గల్లంతు.. కష్టంగానే ఆచూకీ!

- నేపాల్-చైనా సరిహద్దులో ఘోర వరద విపత్తు
- వందలాది చిన్నారులు సహా 5,000 మందికి పైగా గల్లంతు
- ధ్వంసమైన నెట్‌వర్క్‌లతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం
- 17,000 మంది పిల్లలకు తక్షణ సహాయం అవసరమన్న యూనిసెఫ్
- మృతుల సంఖ్య 1,200 దాటడంతో కొనసాగుతున్న సహాయక చర్యలు

నేపాల్‌లో సంభవించిన ఘోర వరద విపత్తు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ జల ప్రళయంలో వందలాది మంది చిన్నారులు సహా వేలాది మంది - మిగతా 2 లో

కొండా సురేఖకు అధికారిక భద్రత ఉపసంహరించుకున్న రేవంత్ ప్రభుత్వం

- మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు
- మంత్రి హోదాలో కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం వెనక్కి
- ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ గన్‌మెన్లను రీకాల్ చేసిన ప్రభుత్వం
- మంత్రి పదవి నుంచి తొలగించిన మరుసటిరోజే చర్యలు
- ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను - మిగతా 2 లో

రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రహస్యాలు బహిర్గతం

'తెలుగు స్క్రైబ్'పై సైబర్ క్రైమ్ కేసు

- సీఎం రేవంత్ రెడ్డి భద్రతా సమాచారం లీకేజీపై కేసు
- 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతా నిర్వాహకులపై సీఎస్‌వో ఫిర్యాదు
- నిమిషాలవారీ షెడ్యూల్, బ్లడ్ గ్రూప్ వివరాలు బహిర్గతం
- ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటున్న తెలుగు స్క్రైబ్
- ఖైరతాబాద్ నుంచి సైబర్ క్రైమ్ పోలీసులకు కేసు బదిలీ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన అత్యంత రహస్య భద్రతా సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై 'తెలుగు స్క్రైబ్' అనే ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదైంది.

కొండా సురేఖను తొలగించారు

పొంగులేటి సంగతి ఏమిటి?: హరీశ్ రావు

- రేవంత్ ను వ్యక్తిగతంగా విమర్శించారనే కొండా సురేఖపై వేటు వేశారన్న హరీశ్
- 22ఏ పేరుతో రైతులను పీడిస్తున్న పొంగులేటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న
- భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని మండిపాటు

తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి - మిగతా 2 లో

ఇరాన్‌పై ఉచ్చు బిగిస్తున్న అమెరికా

- 2027 వరకు బలగాల మోహరింపు పొడిగింపు!
- ఇరాన్‌పై వ్యూహంలో భాగంగా 50,000 మంది సైనికులు, 19 యుద్ధ నౌకల మోహరింపు
- సైనికుల సేవా కాలం పొడిగింపుతో వారిపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి
- సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే అమెరికా లక్ష్యం
- ఎప్పుడైనా దాడికి సిద్ధమంటూ ఇరాన్‌కు ట్రంప్ బహిరంగ హెచ్చరిక

పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో మోహరించిన తమ సైనిక బలగాల గడువును 2027 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు యుద్ధ విషయంలో మరిన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక సైనిక వ్యూహంలో భాగమని 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో వెల్లడించింది. ఇరాన్‌పై సైనిక చర్యలు,

ఎవరెస్ట్ మంచుకు కొత్త ప్రమాదం

షాకింగ్ విషయాలు వెల్లడించిన అధ్యయనం

- ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కార్యకలాపాలతో మంచు కరుగుదల
- 2023లో 8.49 లక్షల మెగాజౌళ్ల వేడి విడుదల
- ఈ వేడి 2,492 టన్నుల మంచును కరిగించగలదు
- మూత్ర విసర్జనతో వెలువడే వేడినీ అధ్యయనంలో లెక్కింపు
- 32 ఏళ్లలో బేస్ క్యాంప్ ఉష్ణోగ్రత 0.28 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరిగింది

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన - మిగతా 2 లో

బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి సీఎం కీలక ప్రకటన

- బెంగాల్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా మిథున్ చక్రవర్తి నియామకం
- కోల్‌కతాలో రూ.25 కోట్లతో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్'కు శంకుస్థాపన
- ఫిలిం సెంటర్ రూపకల్పనలో ప్రభుత్వ జోక్యం ఉండదన్న సీఎం సువేందు
- నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా మూడు విభాగాలతో నిర్మాణం
- వర్షాకాలం ముగిసిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి - మిగతా 2 లో

రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ - మిగతా 2 లో

అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

ఏపీలో అక్షరాస్యత రేటు - మిగతా 2 లో

ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

- పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం
- నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి



ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 05-09-2026

ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి - ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

కొండా సురేఖకు అధికారిక భద్రత ఉపసంహరించుకున్న రేవంత్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి మంత్రి పదవిలో లేనప్పుడు, వారికి కేటాయించిన ప్రత్యేక భద్రతను ఉపసంహరించడం సాధారణ ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇంత వేగంగా భద్రతను వెనక్కి తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది కొండా కుటుంబానికి ప్రభుత్వం పంపిన ఒక బలమైన సంకేతంగా కొందరు భావిస్తున్నారు. ఈ వరుస పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానాన్ని ఎలా మలచుకుంటారనే అంశం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె తదుపరి అడుగులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కొండా సురేఖను తొలగించారు

మొదటిపేజీ తరువాయి - మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

ఎవరెస్ట్ మంచుకు కొత్త ప్రమాదం.. షాకింగ్ విషయాలు వెల్లడించిన అధ్యయనం

మొదటిపేజీ తరువాయి - ఎవరెస్ట్ శిఖరం వద్ద మరో ఆందోళనకర విషయం బయటపడింది. బేస్ క్యాంప్‌లో పెరుగుతున్న మానవ కార్యకలాపాలు ఖుంబు హిమానీనదం కరుగుదలను మరింత పెంచుతున్నాయని తాజా అధ్యయనం తెలిపింది. వాతావరణ మార్పులతో పాటు ఇంధన వినియోగం, మనుషుల మూత్ర విసర్జనతో విడుదలయ్యే వేడి కూడా దీనికి కారణమవుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ప్రతి క్లైంబింగ్ సీజన్‌లో వేలాది మంది పర్వతారోహకులు, పర్యాటకులు, గైడ్లు, సిబ్బందితో సందడిగా మారుతుంది. వంట, విద్యుత్, వేడి కోసం ఎల్పీజీ, కిరోసిన్, పెట్రోల్ వాడుతున్నారు. వీటి నుంచి భారీగా వేడి విడుదలవుతోంది. మనుషుల మూత్ర విసర్జనను కూడా పరిశోధకులు లెక్కల్లోకి తీసుకున్నారు. 2023 వసంతకాలంలో బేస్ క్యాంప్‌లో విడుదలైన మొత్తం వేడి 8,49,174 మెగాజౌళ్లుగా అంచనా వేశారు. ఈ వేడి దాదాపు 2,492 టన్నుల మంచును కరిగించగలదని అధ్యయనం వెల్లడించింది. 1991 నుంచి 2023 వరకు ల్యాండ్‌శాట్ ఉపగ్రహ సమాచారాన్ని పరిశీలించగా బేస్ క్యాంప్ ప్రాంతంలో ఉష్ణోగ్రత ఏటా 0.28 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు తేలింది. ఖుంబు హిమానీనదంతో పోలిస్తే ఇక్కడ వేడెక్కుతున్న వేగం దాదాపు రెండింతలుగా ఉంది. ప్రస్తుతం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ హిమానీనదంపైనే ఉంది. పరిస్థితులు మరింత దిగజారితే క్యాంప్‌ను తరలించాల్సి రావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుత క్యాంప్‌కు నైరుతి దిశలో స్థిరమైన నేలపై రెండు ప్రత్యామ్నాయ ప్రాంతాలను కూడా గుర్తించారు.

ఇరాన్‌పై ఉచ్చు బిగిస్తున్న అమెరికా.. 2027 వరకు బలగాల మోహరింపు పొడిగింపు!

మొదటిపేజీ తరువాయి - ఆర్థిక ఒత్తిడి, అవసరమైతే విస్తృత స్థాయి యుద్ధం వంటి అంశాలను ట్రంప్ పరిశీలనలో ఉంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట ఇరాన్‌పై స్వల్పకాలిక, నిర్ణయాత్మక సైనిక చర్యగా ప్రచారం చేసినప్పటికీ, ఇప్పుడు ఈ మోహరింపు భారీగా విస్తరించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో సుమారు 50,000 మంది అమెరికా సైనికులు, 19 యుద్ధ నౌకలు, ఫైటర్ స్క్వాడ్రన్లు, వాయు రక్షణ విభాగాలు, పారాట్రూపర్లు మోహరించి ఉన్నారు. ఈ సుదీర్ఘ మోహరింపు కారణంగా అమెరికా సైనికులు, వారి కుటుంబాలు, సైనిక పరికరాలపై తీవ్ర భారం పడుతోందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది. ఆర్మీ ఎయిర్ డిఫెండర్ల సేవా కాలాన్ని 9 నెలల నుంచి 12 నెలలకు పెంచారు. యూరప్, పసిఫిక్ ప్రాంతాల నుంచి వచ్చిన కొన్ని యూనిట్లు ఏడాదికి పైగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాయి. నౌకాదళం కూడా ఇదే విధమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం రెండు విమానవాహక నౌకలు, 13 గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్‌లతో సహా మొత్తం 19 యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. యుద్ధం ప్రారంభంలో పంపిన యూఎస్ఎస్ డెల్బర్ట్ డి. బ్లాక్, యూఎస్ఎస్ ట్రూయన్స్ వంటి నౌకలు, వాటిలోని 300 మంది సిబ్బంది నెలల తరబడి విరామం లేకుండా సముద్రంలోనే గడుపుతున్నారు. అదే సమయంలో ట్రంప్ యంత్రాంగం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ప్రయోగించడం ద్వారా ఆ దేశ నాయకత్వాన్ని తిరిగి చర్చల టేబుల్‌పైకి తీసుకురావాలని వ్యూహరచన చేస్తోంది. ఆర్థిక ఒత్తిడితోనే ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తుందని, అందుకే ఈ యుద్ధాన్ని ముగిసినట్లుగా ప్రకటించడంపై ట్రంప్ తన సీనియర్ సహాయకులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "హర్మూజ్ జలసంధిపై మాకు పూర్తి నియంత్రణ ఉంది. వాళ్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఇరాన్ ప్రజలు ఎప్పుడు తిరుగుబాటు చేస్తారు?" అని రాశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. "ఎప్పుడైనా, ఎక్కడైనా దాడులు చేసేందుకు అమెరికా పూర్తి సన్నద్ధంగా ఉంది. మేము వారి రాడార్ వ్యవస్థను ధ్వంసం చేశాం. వాళ్లు ఏం చేస్తున్నారో మాకు అన్నీ తెలుసు. వాళ్లు బాత్రూమ్‌కు వెళ్లినా మేము చూడగలం" అని వ్యాఖ్యానించారు. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికలపై ఈ యుద్ధం ప్రతికూల ప్రభావం చూపుతుందని ట్రంప్ సహాయకులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని తాను నిర్ణయాలు తీసుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసి, ఆ దేశ వాణిజ్య భాగస్వాములపై ఆంక్షలు విధించడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్నది అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది.

అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

మొదటిపేజీ తరువాయి - 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రహస్యాలు బహిర్గతం 'తెలుగు స్క్రైబ్'పై సైబర్ క్రైమ్ కేసు

మొదటిపేజీ తరువాయి - సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రేవంత్ రెడ్డి జులై 13న ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనకు సంబంధించి ఆయన నిమిషం-నిమిషం కార్యక్రమం, జడ్-ప్లస్ భద్రతా ఏర్పాట్లు, సీఎస్‌వో అధికారిక మొబైల్ నంబర్, అత్యవసర పరిస్థితుల కోసం సీఎం బ్లడ్ గ్రూప్ వంటి సున్నితమైన వివరాలతో కూడిన వైర్‌లెస్ సందేశాన్ని సీఎం ప్రైవేట్ సెక్రటరీ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు పంపించారు. అయితే, అదే రోజు ఈ రహస్య సమాచారాన్ని 'తెలుగు స్క్రైబ్' తమ ఎక్స్ ఖాతాలో ప్రచురించింది. దీంతో సీఎం భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక వివరాలు బహిర్గతమయ్యాయి. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కేబీ ఫ్రాంక్లిన్, జులై 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన సమాచారం బయటకు రావడం భద్రతకు ముప్పు కలిగించే చర్య అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల్లో ఎవరో ఒకరు ఈ సమాచారాన్ని అక్రమంగా లీక్ చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తొలుత ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు కోసం దీనిని సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ కేసు నమోదుపై 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ వేదికగా స్పందించింది. "ఢిల్లీ పర్యటనలపై వార్త రాసినందుకు రేవంత్ రెడ్డి మరో మెడల్ ఇచ్చారు. దేశంలో ఒక సీఎం తన పర్యటనలపై వార్త రాసినందుకు కేసు పెట్టడం ఇదే మొదటిసారి" అని తమ పోస్ట్‌లో పేర్కొంది. గతంలోనూ ఈ సోషల్ మీడియా హ్యాండిల్ ప్రభుత్వం, సీఎంపై విమర్శనాత్మక పోస్టులు పెడుతూ ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూఏపీఏ సెక్షన్ కింద ఈ ఖాతా వివరాలు ఇవ్వాలంటూ పోలీసులు 'ఎక్స్'కు నోటీసులు పంపడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

మొదటిపేజీ తరువాయి - శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

పుష్కర కాలంగా పన్ను ఎగవేత

2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

ఇక ఉపేక్షించేది లేదు..

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

మొదటిపేజీ తరువాయి - చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

భారత స్థిరత్వం కీలకం

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

రక్షణ బంధం మరింత బలోపేతం

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

వరుస పర్యటనలతో బంధం బలోపేతం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి.. సీఎం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి - సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్' నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. రూ.25 కోట్ల వ్యయంతో ఈ ఫిలిం సెంటర్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర సమాచార, సాంస్కృతిక శాఖ ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. ఫిలిం సెంటర్ డిజైన్‌ను ఖరారు చేసే బాధ్యతను పూర్తిగా బెంగాలీ సినీ రంగ నిపుణులకే అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. "ఈ రంగంతో సంబంధం ఉన్నవారికే ఆ పనిలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మా పని కేవలం మద్దతు ఇవ్వడమే. ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదు" అని సీఎం అన్నారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా ఈ కొత్త ఫిలిం సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో 750 సీట్ల సామర్థ్యంతో రెండు సినిమా హాళ్లు, ఒక ప్రివ్యూ థియేటర్, ఫుడ్ కోర్ట్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రెండో విభాగంలో 1,000 సీట్ల ఆడిటోరియం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్-ఎయిర్ థియేటర్ ఉంటాయి. మూడో విభాగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్ కోసం అత్యాధునిక ల్యాబొరేటరీలు, స్టూడియోలు నిర్మిస్తారు. ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, స్థల ఎంపిక పూర్తయ్యాయని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రక్రియ కొనసాగుతోందని సీఎం వివరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పశ్చిమ బెంగాల్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. సెప్టెంబర్ 6 వరకు టాలీవుడ్ (బెంగాలీ చిత్ర పరిశ్రమ) కు చెందిన పలువురు ప్రముఖులను సన్మానించనున్నట్లు, ఈ సన్మాన గ్రహీతల ఎంపికలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సినీ పరిశ్రమ కమిటీయే ఆ బాధ్యత తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

వందలాది చిన్నారుల గల్లంతు.. కష్టంగానే ఆచూకీ!

మొదటిపేజీ తరువాయి - గల్లంతయ్యారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం కావడంతో గల్లంతైన వారిని, ముఖ్యంగా పిల్లలను గుర్తించడం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. వారి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 26న నేపాల్-చైనా (టిబెట్) సరిహద్దులోని హిమాలయాల్లో భారీ హిమానీనదం కూలిపోవడంతో త్రిశూలి నదికి వరదలు పోటెత్తాయి. ఈ ఆకస్మిక వరదల ధాటికి చైనా-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ చెక్‌పాయింట్ సహా పలు పట్టణాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 1,200 దాటింది. నేపాల్, టిబెట్ కలిపి గల్లంతైన వారి సంఖ్య 4,000 నుంచి 5,000 మధ్య ఉంటుందని అంచనా. గల్లంతైన వారిలో భారతీయులు, అమెరికన్లతో పాటు పలువురు విదేశీయులు కూడా ఉన్నారు. ఈ విపత్తులో చిన్నారులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. యూనిసెఫ్ ప్రకారం, సుమారు 17,000 మంది పిల్లలకు తక్షణ మానవతా సహాయం అవసరం. వరదల కారణంగా 18 పాఠశాలలు పూర్తిగా నేలమట్టం కాగా, మరో 20 పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం, సుమారు 230 నుంచి 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు గల్లంతయ్యారు. కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. యూనిసెఫ్ బృందాలు వారిని గుర్తించి, కుటుంబ సభ్యులతో కలిపేందుకు, మానసిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని కనుగొనడంలో 'తెగిపోయిన నెట్‌వర్క్‌లు' అతిపెద్ద సవాలుగా మారాయి. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా స్తంభించాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చాలా ప్రాంతాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. కేవలం హెలికాప్టర్ల ద్వారా మాత్రమే సహాయక బృందాలు అక్కడికి చేరుకోగలుగుతున్నాయి. దీంతో సహాయక చర్యలు, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 05-09-2026

ఎస్ పిటియు జర్నలిజం విద్యార్థుల గురుదక్షిణ పుస్తకావిష్కరణ నేడు..

నిజం న్యూస్ హైదరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 04 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందిన గురుదక్షిణ కవితా సంకలనం పుస్తకావిష్కరణ సభ నేడు జరగనుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 60 మంది కవులు ఈ కవితా సంకలనంలో భాగస్వాములు అయ్యారు. గురువుల విశిష్టతను తెలియజేస్తూ అద్భుత కవితలను ఆవిష్కరించారు. అంజిబాబు ఫౌండేషన్ సహకారంతో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ బాచుపల్లి క్యాంపస్ లో ఈ పుస్తకావిష్కరణ జరగనుంది. వర్సిటీ వీసీ వెల్దండ నిత్యానందరావు విశిష్ట అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, జర్నలిజం విభాగాధిపతి బిహెచ్. పద్మప్రియ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. కొండూరి కోటిబాబు, నాగుల అంజిబాబు, ఎస్. కళ్యాణ్ దాస్ ఈ కవితా సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించారు. పుస్తకావిష్కరణకు ముందు గురుపూజోత్సవం సందర్భంగా జర్నలిజం అధ్యాపకులను విద్యార్థులు ఈ సందర్భంగా సత్కరించనున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గోపిక, చిన్ని కృష్ణుడు వేషధారణలతో అలరించిన చిన్నారులు

నిజం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 4 శ్రీకృష్ణాష్టమి రోజు చిన్న పిల్లల సందడి అంతా ఇంత కాదు. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్న వాళ్లు.. తమ బిడ్డలను కన్నయ్యలా అలంకరించి మురిసిపోతారు. నగరంలోని పలు కాలనీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ఈ దృశ్యాలే కన్పించాయి. కృష్ణుడి వేషధారణలో చిన్నారి బాల బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా జన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. చిటిపొట్టి చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు కృష్ణుడు, గోపిలు, యశోద వంటి వేషధారణలతో కృష్ణాష్టమి సంబరాలను జరుపుకున్నారు. మగ పిల్లలకు కృష్ణుడి వేషం, ఆడ పిల్లలను గోపికలా తయారుచేసి తల్లిదండ్రులు సంతోషించారు. కొన్ని ప్రాంతాల్లో స్కూల్స్ లో కూడా కృష్ణాష్టమి సంబరాలను నిర్వహించారు. తమ స్టూడెంట్స్ కు కృష్ణుడి గోపికల వేషాలు వేసి వేడుకలను జరిపారు.చిన్నారులు గోపిక, శ్రీకృష్ణ వేషధారణలతో ఆకట్టుకున్నారు. వేశాధారణతో ముచ్చటగొల్పిన చిన్నారుల ఫోటోలు

జై గణేష్ భక్త సమితి కూకట్పల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా యక్కంటి వెంకట్ రెడ్డి

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 కూకట్పల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా యక్కంటి వెంకటరెడ్డి (ఎ=)జై గణేష్ భక్తి సమితి -- తెలంగాణ రాష్ట్రం కూకట్పల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా యక్కంటి వెంకటరెడ్డి (ఎ=) ని నియమించింది.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏ. జైన్ కుమార్, చైర్మన్ కే.ఎస్. ఆనంద్ రావు చేతుల మీదుగా యక్కంటి వెంకటరెడ్డి కి నియామక పత్రాన్ని అందజేశారు.గత ఆరు సంవత్సరాలుగా మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ, మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన మరియు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన చేస్తున్న నిరంతర సేవలను గుర్తించిన సమితి, ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా యక్కంటి వెంకటరెడ్డి (ఎ=) మాట్లాడుతూ, మట్టి గణేష్ విగ్రహాల వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సమితి ఆశయాలను కూకట్పల్లి నియోజకవర్గంలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. యక్కంటి వెంకటరెడ్డి నియామకంపై భక్తులు, సేవాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

మినీ స్టేడియం లో ఘనంగా ప్రజా వికాస సభ

ఉమ్మడి నల్గొండ జిల్లా సెప్టెంబర్ 4, నిజం న్యూస్ రిపోర్టర్ (భూతం శ్రీకాంత్) రేపు జరగబోయే నకిరేకల్ పట్టణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా, ప్రభుత్వ విప్,నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ప్రజా వికాస సభ.నిర్వహించనున్నారు, ఈ ప్రజా వికాస సభకు నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత ప్రజలు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. తెలంగాణ ఉద్యమకారుడు.పగిడాల విక్రమ్, ఇంద్ర పాలనగరం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు,జేన కిరణ్ ,శోభనాద్రిపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిశెట్టి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలనగరంలో

శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

ఉమ్మడి నల్గొండ జిల్లా సెప్టెంబర్ 4 నిజం న్యూస్రిపోర్టర్ (భూతం శ్రీకాంత్)యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం, గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా యాదవ సోదరులతో కలిసి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టి కార్యక్రమం లో పాల్గొని గెలుపొందిన విజేత సింగనబోయిన నిశాంత్, తండ్రి మహేష్ సన్మానించిన.తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేసీపీ రాష్ట్ర కార్యదర్శి సర్పంచ్ ఇంద్రపాలనగరం,గర్దాస్ విక్రమ్, ఉప సర్పంచ్ జయసుధ స్వామి.బిఆర్ఎస్,సీనియర్.నాయకులు,సింగనబోయిన జంగయ్య, ఇంద్రపాలనగరం పాల సంఘం చైర్మన్, కంబాల పెద్ది శ్రీశైలం, మాజీ యాదవ సంఘం అధ్యక్షుడు కంబాల పెద్ది మల్లయ్య, వార్డ్ మెంబర్ చిన్నలచ్చి రమేష్, జిల్లాల వెంకటేష్, తేల వెంకటేష్ , సీరుదు వెంకటేష్, సింగన బోయిన మహేష్, నల్ల భాస్కర్, మద్ది మహేష్, భూతం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడమే అంతిమ ధ్యేయం

జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి
పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే
అరుణమ్మతో కలిసి పలు కార్యక్రమాలకు శ్రీకారం
గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే, ఎంపీ విశేష కృషి
సూరారం అభివృద్ధికి హెచ్ఎండిఏ 2.02 కోట్ల
నిధులతో మౌలిక వసతుల కల్పన
అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన --
ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
ఎ-+ఋతీఒ కంపెనీ సహకారంతో రూ.33
లక్షలతో నూతన పాఠశాల భవనం

నిజం న్యూస్ ప్రతినిధి, బాలానగర్ (జడ్చర్ల), ఆగస్టు 04 : జడ్చర్ల నియోజకవర్గం లోని అన్ని తాండాల గ్రామాల సంపూర్ణ అభివృద్ధి తన ధ్యేయం అని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం ఈ మేరకు మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల బాలానగర్ మండల పరిధిలోని సూరారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మతో కలిసి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాత్లావత్ సోమ్లా నాయక్, సర్పంచ్ యాదమ్మ పాండయ్య గౌడ్ ఆధ్వర్యంలో బాలానగర్ మండలంలోని సూరారం గ్రామం (శంకరయ్యపల్లి తండా) లో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా పాల్గొన్నారు. అనంతరం ఎ-+ఋతీఒ కంపెనీ సహకారంతో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవకాశం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. సూరారం గ్రామ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు .. ఈ సందర్భంగా శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ... హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో ఎప్పట్టనున్న అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు పూర్తయితే గ్రామంలోని ప్రజలకు మెరుగైన రహదారి, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల దైనందిన సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, నియోజకవర్గానికి అవసరమైన నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, విద్యుత్ తదితర ప్రాథమిక మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సూరారం గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామిక సంస్థల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విని రాజేశ్వర్ రెడ్డి, బాలానగర్ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి గుట్ట శంకర్ నాయక్, కేవీఆర్ వెంకటరెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు పాత్లావత్ గోపాల్ నాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో అర్ధరాత్రి విద్యార్థులపై దాడి

స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్పై చర్యలు తీసుకోవాలి

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 జేఎన్టీయూ యూనివర్సిటీలో నిన్న అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) కు సంబంధించిన విద్యార్థులమని చెప్పుకునే కొందరు వ్యక్తులు మద్యం మత్తులో హాస్టల్లోకి ప్రవేశించి విద్యార్థులపై తీవ్ర దాడికి పాల్పడ్డారు.

1. మంజీరా హాస్టల్లోని విద్యార్థుల గదుల్లోకి వెళ్లి, తలుపులను కాళ్లతో తన్నుతూ, రాళ్లతో కొడుతూ, అసభ్య పదజాలంతో, బూతులు తిడుతూ, దూషిస్తూ డోర్ల బద్దలు కొట్టి జూనియర్ విద్యార్థులపై దాడి చేశారు.
2. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, రాందేవ్ హాస్పిటల్లో రాత్రి నుంచి చికిత్స పొందుతున్నారు.
3. ఈ ఘటనకు స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ కు చెందిన ముఖ్య నాయకులు చెప్పబడుతున్న తదితరులు కారణమని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
4. విషయం తెలుసుకున్న కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ వాహనం యూనివర్సిటీకి చేరుకోగానే, మద్యం మత్తులో ఉండి దాడికి పాల్పడిన ప్రశాంత్, వసంత్ లను అరెస్ట్ చేయగా., అక్కడ ఉన్న పలువురు వ్యక్తులు పారిపోయారు.
5. అనంతరం జేఎన్టీయూహెచ్ మెయిన్ గేట్ వద్ద 40--50 మంది ఎస్పీఎఫ్ చెందిన వ్యక్తులు కర్రలు, రాడ్లతో చేరి, సెక్యూరిటీ సిబ్బంది, సెక్యూరిటీ సూపర్వైజర్ సమక్షంలో, జజుఒ కెమెరాల కింద గొడవను ఆపేందుకు ప్రయత్నించిన అమాయక విద్యార్థులపై తీవ్రంగా కర్రలతో మరోసారి దాడి చేశారు.
6. ఈ దాడిలో ముగ్గురు అమాయక విద్యార్థులు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల ప్రకారం వారి పరిస్థితి 24 గంటల పాటు పరిశీలించాల్సి ఉంది.
7. ఈ ఘటనకు నిరసనగా 165 మంది విద్యార్థులు అర్ధరాత్రి 3 గంటల నుంచి ఉదయం 6:30 గంటల వరకు జేఎన్టీయూహెచ్ మెయిన్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు.
8. స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరుతో ఎలాంటి అధికారిక ధ్రువపత్రాలు లేకుండా ఒక సంస్థను ఏర్పాటు చేసి, జేఎన్టీయూహెచ్లో గొడవలకు కారణమవుతున్నారనే ఆరోపణలు విద్యార్థుల నుంచి వస్తున్నాయి. ఈ సంస్థ ఫౌండర్ ఓ ప్రెసిడెంట్ గా జావళి దిలీప్ వ్యవహరిస్తున్నారని, ఆయన జేఎన్టీయూహెచ్లో పీహెచ్డీ చదువుతున్నారని, ఆయన పై 18 ప్రస్తుత కేసులు ఉన్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
9. గతంలో కూడా స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరుతో అనేక గొడవలు, వివాదాస్పద కార్యక్రమాలు జరిగి, యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
10. ఈ ఘటన నేపథ్యంలో విద్యార్థులు ఎస్పీఎఫ్ జెండాలను యూనివర్సిటీ నుంచి తొలగించి, జేఎన్టీయూహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.
11. జే.ఎన్టీయూహెచ్ యూనివర్సిటీ మేనేజ్మెంట్ వెంటనే సమగ్ర విచారణ జరిపి ఘటనకు కారణమైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే అడ్మిషన్లు రద్దు చేసి యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణాన్ని పునరుద్ధరించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.
12. అలాగే కెపిహెచ్బి పోలీసులు విద్యార్థులు కోరుతూ, ఈ ఘటనకు ప్రధాన కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దుర్గాప్రసాద్, సాగర్ నాయక్, తనూజ, చందు, వసంత తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బైండోవర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
13. ప్రస్తుతం ఘటనకు కారణమైన వ్యక్తులకు చెందిన పలువురు పరారీలో ఉన్నారని కేవలం ఇద్దరు మాత్రమే కెపిహెచ్బి పోలీస్ స్టేషన్లో ఉన్నారని విద్యార్థులు చెబుతున్నారు. అదే సమయంలో, గొడవ జరుగుతున్న సమయంలో అక్కడ ఉన్న కొంతమంది అమాయక విద్యార్థులను కూడా పోలీసులు పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జేఎన్టీయూ విద్యార్థుల భద్రత, యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడేందుకు యూనివర్సిటీ యాజమాన్యం, పోలీసులు వెంటనే స్పందించి సమగ్ర విచారణతో కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లి, జేఎన్టీయూహెచ్ ప్రతిష్టను కాపాడేందుకు మీడియా మిత్రులు సహకరించాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ మెరుగుదలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల క్షేత్రస్థాయి పరిశీలన

నిజం న్యూస్ సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 4 సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ రాకపోకలను మరింత సులభతరం చేయడంతో పాటు రహదారి మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు.

గౌలిదొడ్డి: యూటర్న్లు, ట్రాఫిక్ రద్దీ పరిస్థితులను అధికారులు పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త యూటర్న్లు ఏర్పాటు చేయడం, అవసరం లేని యూటర్న్లను మూసివేయడం వంటి చర్యలపై సమీక్షించారు.

డెలాయిట్, మాదాపూర్: ఉద్యోగుల పికప్, డ్రాప్ ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల ఎగ్జిట్ను ఫ్రంట్ గేట్ కు మార్చాలని సంస్థ యాజమాన్యానికి సూచించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ను నియంత్రించేందుకు 8 మంది మార్షల్స్ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఫీనిక్స్ బిల్డింగ్: ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు శిల్పా ఫ్లైఓవర్ వైపు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ రాకపోకలు సాఫీగా సాగేందుకు, వాహనదారుల భద్రతను పెంచేందుకు అవసరమైన చర్యలను నిరంతరం చేపడుతున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

22-ఎ భూముల సమస్యపై ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జనసేన భారీ నిరసన దీక్షలో పాల్గొన్న జనసేన రాష్ట్ర నాయకులు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 4 శుక్రవారం హైదరాబాద్లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆస్తిహక్కులను కాపాడాలి, 22-ఎ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి" అనే ప్రధాన డిమాండ్తో 22-ఎ భూముల సమస్య పరిష్కారం కోసం భారీ నిరసన దీక్ష నిర్వహించారు. ఈ నిరసన దీక్షలో కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొని, 22-ఎ భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. 22-ఎ జాబితాలో భూములు చేరడం వల్ల అనేక సంవత్సరాలుగా భూమి యజమానులు తమ ఆస్తులను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. చట్టబద్ధమైన హక్కులు కలిగి ఉన్న సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేపట్టి, అర్హత ఉన్న భూములను 22-ఎ జాబితా నుంచి తొలగించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజల ఆస్తిహక్కుల పరిరక్షణే ప్రభుత్వ బాధ్యత అని, ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న 22-ఎ సమస్యను ఇకపై జాప్యం చేయకుండా పరిష్కరించాలని జనసేన నాయకులు ప్రభుత్వాన్ని కోరారు ఈ భారీ నిరసన దీక్షకు సంఘీభావంగా కూకట్పల్లి నియోజకవర్గం నుంచి భారీ బైక్ ర్యాలీతో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నినాదాలతో ధర్నా చౌక్ ప్రాంతాన్ని మార్మోగిస్తూ, ప్రజల ఆస్తిహక్కుల పరిరక్షణ కోసం తమ గళాన్ని బలంగా వినిపించారు

చలి పంజాకు గురికాకుండా

సాధారణంగానే శీతకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గితుంది. మరీ ముఖ్యంగా గర్భిణులపై చలి తీవ్ర ప్రభావం చూపుతుంది. జలుబు, దగ్గుతోపాటు కీళ్లు పట్టేయడం, పొడిచర్మం వంటి సమస్యలు వారిని ఇబ్బంది పెడతాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే.. చలికాలంలో గర్భిణులు ఇబ్బంది పడకుండా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి వాతావరణం, పదేపదే మూత్రానికి వెళ్లాల్సిరావడం వల్ల.. ఈ కాలంలో గర్భిణులు నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దాంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. అయితే, గర్భిణుల్లో డీహైడ్రేషన్ చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శరీరంలో తగినంతగా నీటి స్థాయిలు లేకపోతే.. ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పరిస్థితి అలాగే కొనసాగితే.. ముందస్తు డెలివరీ అయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి.. ఏ కాలమైనా తగిన మోతాదులో నీళ్లు తాగడం మంచిది. ఈ కాలంలో చర్మం పొడిబారడం సహజం. ఇక గర్భిణుల్లో పొట్ట పెరిగేకొద్దీ చర్మం సాగుతూ ఉంటుంది. దాంతో చర్మం పగిలి.. ఆ ప్రదేశంలో దురద పెడుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. అందుకే.. వైద్యుల సూచన మేరకు ప్రత్యేక క్రీములు, లోషన్లు, నూనెలు రాసుకోవాలి. రోజుకు ఒకటి రెండుసార్లు పొట్ట భాగంలో నెమ్మదిగా మసాజ్ చేసుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవడంతోపాటు చర్మం తేమగా ఉంటుంది. ప్రసవం తర్వాత స్ట్రెచ్‌మార్క్స్ రాకుండా కూడా తోడ్పడుతుంది. చలికాలంలో వేధించే మరో ప్రధాన సమస్య.. కీళ్లనొప్పులు. చలి గాలులకు శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోయి.. రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దాంతో కండరాలు, కీళ్లు బిగుసుకుపోతాయి. గర్భిణులను ఈ సమస్య మరింత ఎక్కువగా వేధిస్తుంటుంది. దీనినుంచి బయటపడేందుకు.. వైద్యుల సలహా మేరకు నిపుణుల ఆధ్వర్యంలో 'అరోమా థెరపీ' చేయించుకోవడం మంచిది. లావెండర్, టీ ట్రీ, యూకలిప్టస్ వంటి నూనెలతో శరీరాన్ని సున్నితంగా మసాజ్ చేయించుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శారీరక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

ఫ్యాషన్ రంగవల్లిక బంజారా అల్లిక

దుస్తులంటే నాగరికత. ఆ దుస్తులే అస్తిత్వ పతాకలు. రంగులే అభిరుచుల వ్యక్తీకరణ. ఆహార్యమే గుర్తింపు, గౌరవం, వారసత్వం. అవన్నీ కోల్పోతే పరాయీకరణే. రంగురంగుల హంగులు ఉండే వస్త్రశ్రేణితో అలరించిన నిన్నటి తరం బంజారాలు.. కాల ప్రవాహంలో తమ ఆహార్యాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతించిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే కాదు.. ఆ బంజారాల వస్త్ర సౌందర్యాన్ని ఆధునిక దుస్తులకు ఆపాదిస్తున్నది బంజారా కసూతి సంస్థ. లంబాడీ మహిళలను ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవం వైపు నడిపిస్తున్నది. తెలంగాణలో లంబాడీలు ఉన్నట్టే.. కర్ణాటకలోనూ ఉన్నారు. వీరిని లంబానీలు అని పిలుస్తారు. ప్రాంతం వేరైనా వీరి కట్టూ, బొట్టూ ఒకేలా ఉంటుంది. విజయపుర ప్రాంతంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడి మహిళలు చూపు తిప్పుకోలేనంత అందమైన దుస్తులు, ఆభరణాలను నిండుగా ధరించేవారు. ఒకప్పుడు వీరి ఆహార్యం చూడగానే బంజారాలని గుర్తుపట్టేవాళ్లు. కానీ, ఇప్పుడు తలపై నుంచి జారుతూ ఉండే అద్దాల అంచుల టుక్రీ మెరుపులు లేవు. సంప్రదాయ గాగ్రీ (లెహంగా) కూడా ధరించట్లేదు. కాంక్లీ (రవిక లాంటిది), దాని పైనుంచి వేసుకునే ఆభరణాలు కూడా దాదాపు కనుమరుగయ్యాయి. గాగ్రీ బదులు చీర కట్టుకుంటున్నారు. ఒకప్పుడు వస్త్రధారణ వల్ల ప్రత్యేకంగా కనిపించే ఈ బంజారా బిడ్డలు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరిలా ఉండాలన్న కోరిక వాళ్లకు లేదు. సంప్రదాయ వస్త్రధారణ పట్ల ప్రేమ తప్ప వ్యతిరేకత లేదు. వారసత్వ కళ మీద మమకారమే కానీ ఛీత్కారం లేదు. వారికి లేనిదల్లా ఉపాధే! డబ్బే అన్నిటినీ శాసిస్తున్న ఈ కాలంలో వారి జీవన సౌందర్యం కనుమరుగైపోయింది.

కనువిందు చేసే అందాలు

చేతిలో డబ్బుల్లేని కాలం దాపురించడంతో బతుకు దెరువు కోసం కూలీనాలీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గూడేల్లో దర్జాగా ఉన్న బంజారా బతుకులు పట్నాల్లో పరుగులు తీయడం మొదలుపెట్టాయి. ఈ క్రమంలో వాళ్లకే సొంతమైన అల్లికలు చిక్కుల్లో పడ్డాయి. అలా మెరిసే అద్దాలు దారాల కుట్లకు దూరమయ్యాయి. రంగురంగుల అతుకులు ఆదరించేవాళ్లు లేక గతుక్కుమన్నాయి. అల్లి'కళ'కు దూరమై సంప్రదాయ వస్త్రశ్రేణిని కాదని సింథటిక్ చీరలు చుట్టుకుంటున్నారు బంజారా మహిళలు. ఆరోగ్యవంతమైన వస్త్రధారణ వదిలి రోగాల్ని అంటించే వస్త్రాలను ఆదరిస్తున్నారు. ఈ దయనీయమైన స్థితిని ఆశా పాటిల్ గుర్తించింది. విజయపురలో పుట్టిన ఆమె చిన్నప్పటి నుంచి లంబానీల దుస్తులు, వాటి ప్రత్యేకతలను ముచ్చటపడి చూస్తూ ఉండేది. కాలక్రమంలో వచ్చిన మార్పుల వల్ల లంబాడీల దుస్తులు మాయమవడం ఆమెను కలచి వేసింది. ఆ సామాజిక వర్గంలో ఎంబ్రాయిడరీ మెలకువలు తెలిసిన మహిళల్ని చేరదీసి ఆ కళను బతికించే పనికి పూనుకున్నది. బంజారా కసూతి అనే సంస్థను ప్రారంభించింది. సృజనాత్మకమైన అల్లికల్లో చేతి వృత్తుల వారి నైపుణ్యాలను, సంప్రదాయ దుస్తులను కాపాడుకోవడం ఈ సంస్థ లక్ష్యం.

పల్లెల్లో ఫ్యాషన్ పాఠాలు

హస్తకళలు, సంస్కృతిని కాపాడుకోవడం కోసం పాటుపడితే కడుపునిండట్లేదనే హస్తకళాకారులు ఇతర వృత్తులకు మారిపోతున్నారు. ఈ రెండు పరిణామాలతో ఎన్నో హస్తకళలు అంతరించి పోతున్నాయి. అవసాన దశలో ఉన్న లంబాడీ ఎంబ్రాయిడరీ, చేనేత హస్తకళలను కాపాడుకోవాలంటే ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత కల్పించడం కూడా బంజారా కసూతి లక్ష్యంగా పెట్టుకుంది. విజయపుర సమీప గ్రామాలను ఒక యూనిట్‌గా ఆశా పాటిల్ ఎంపిక చేసుకుంది. ఆ గ్రామాల్లో అల్లిక నైపుణ్యం ఉన్న 18 మంది బంజారా మహిళలను గుర్తించింది. వారంతా కలిసి పనిచేసేందుకు, కొత్త పనులు నేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. మార్కెట్‌కి అనుగుణంగా ఆధునిక దుస్తులపై లంబాడీల అల్లికల డిజైన్లు వేసేందుకు వాళ్లకు శిక్షణ ఇచ్చారు. ఎంబ్రాయిడరీలో వాళ్లకు ఉన్న నైపుణ్యంతోపాటు అందులో రాటుదేలేలా, పనిచేసేలా ప్రోత్సాహాన్ని అందించింది ఆశా. వర్క్‌షాప్‌లు నిర్వహించి ఆధునిక దుస్తులు, మార్కెట్ గురించి అవగాహన కల్పించింది. బంజారా కసూతి ప్రయాణం మొదలైన తర్వాత ఆశా పాటిల్‌తో కలిసి పనిచేసేందుకు సీమా కిశోర్ చేయి కలిపింది. ఇద్దరూ కలిసి లంబాడీ కళను, సంప్రదాయాలను కాపాడుతూ రేపటి కోసం కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు.

అద్దాల మెరుపులెన్నో

బంజారా కసూతి లక్ష్యం నెరవేర్చేందుకు ఖాదీ, కాటన్, లినెన్, మిక్స్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందించిన దుస్తులపై అల్లికల డిజైన్లను వేయించడం మొదలుపెట్టారు. సంప్రదాయ దుస్తులైన కుర్తా పైజామాల నెక్, హ్యాండ్ బార్డర్‌లపై అద్దాల మెరుపులు, రంగుల అల్లికలతో ఫ్యాషన్ మార్కెట్‌కి కొత్తందాలు పరిచయం చేశారు. చీరలు, రవికెలకు ఈ అల్లికలు మరింత సొబగుగా కుదిరాయి. ఇక పాశ్చాత్య దుస్తులపై వేసిన బంజారా కసూతి డిజైన్లకు విశేషంగా ఆదరణ లభించింది. యువత డిమాండ్‌కు అనుగుణంగా బంజారా అతివలు అద్భుతాలు చేశారు. ఈ విజయం తర్వాత వస్త్రంతో తయారుచేసిన హ్యాండ్ బ్యాగులు, కుషన్లపై కూడా బంజారా అద్దాల మెరుపులు అద్ది ఇల్లు చక్కదిద్దుకుంటున్నారు.

ప్రౌడ్ బంజారా

చేనేత వస్త్రాలను, ఎంబ్రాయిడరీని ఈతరానికి నచ్చేలా తీర్చిదిద్దడంలో బంజారా కసూతి కృషి ఫలించింది. అనుకున్నట్టే వాళ్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరడంతో వేరే వ్యవసాయ పనులకు వెళ్లకుండా పూర్తిగా అల్లికలు, కుట్ల పనుల్లోనే ఉండిపోయారు ఆ మహిళలు. ఒక ప్రాంతంలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని మిగతా ప్రాంతాలకు విస్తరిస్తూ పోయారు ఆశా, సీమా. ఇప్పుడు మొత్తం అయిదు ప్రాంతాల్లో బంజారా కసూతి పని చేస్తున్నది. అరవై మంది మహిళలు ఎంబ్రాయిడరీనే జీవనాధారంగా ఎంచుకుని బతుకుతున్నారు. పూర్వికుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ అల్లికను రేపటి తరం మరచిపోకుండా కాపాడుకునేందుకు వారికి బంజారా కసూతి ఓ అవకాశం కల్పించింది. అంతేకాదు లంబాడీల వేషభాషలపై సమాజంలో ఉండే చిన్నచూపు వల్ల వాళ్ల పిల్లల్లో న్యూనతాభావం పెరిగింది. సంప్రదాయ దుస్తులు ధరించడానికి ఆసక్తి చూపట్లేదు. బంజారా కసూతి ప్రయోగంతో బంజారా వస్త్ర శ్రేణికి నగరాల్లో ఆదరణ పెరిగింది. దీంతో తమ వారసత్వ దుస్తు లు ధరించడం కోసం ఆసక్తి చూపడమే కాదు గర్వంగా భావిస్తున్నారు బంజారా అతివలు.

సీఎం ఎంపికలో చారిత్రక తప్పిదం



పురాతన పార్టీగా పేరున్న కాంగ్రెస్ దేశంలోని మూడు రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉన్నది. వాటిలో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక ఒకటైతే, అతికష్టం మీద అధికారంలోకి వచ్చిన తెలంగాణ రెండవది. పద్నాలుగేండ్ల పాటు ఉద్యమాన్ని నడిపించి, మరో పదేండ్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్‌ను కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, ఆ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి ఎంపికలో చారిత్రక తప్పిదం చేసినట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మిగతా సీనియర్ నాయకులను కాదని ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టడం ఆ పార్టీ చేసిన అతి పెద్ద తప్పిదంగా మారింది. కనీసం మంత్రిగా కూడా అనుభవం లేని రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ముఖ్యమంత్రిగా ఎలాంటి మార్పులు తీసుకురాకపోగా రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులు, సోషల్ మీడియా వ్యాఖ్యలపై పోలీసు కేసులు ఆ పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంపై కక్షగట్టి కేసీఆర్, కేటీఆర్ లాంటి నాయకులపై ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే ఆతృతతో ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతకైనా దిగజారేందుకు ప్రయత్నిస్తున్నారు. కేటీఆర్ లాంటి నాయకుడిని అరెస్టు చేసి ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్న ఆయన ప్రయత్నాలు ఏ మాత్రం సఫలం కావడం లేదు. ఇవన్నీ కాంగ్రెస్ పరువును దిగజార్చుతున్నాయి. ఒక జాతీయ పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా దిగజారడం ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాగే తన వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ వైషమ్యాల కోసం ఇలాగే సమయం వృథా చేస్తే ఆ నష్టం కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు ఈ రాష్ట్ర ప్రజలకు కూడా జరుగుతుంది. ఇక తెలంగాణ ఉద్యమ చిహ్నాలను, రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను మార్చే ఉద్దేశంతో ఉన్న ఆయన మొదట రాజముద్రను మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. తర్వాత టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చారు. ఇలా పేర్లు, చిహ్నాల మార్పులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఆయన జాతీయస్థాయిలో బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలకు, విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వైఖరితో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పల్చనయ్యే అవకాశం ఉన్నది. ఇక, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఇప్పటివరకు రుణమాఫీ పూర్తికాలేదు. దానికోసం ఆశగా ఎదురు చూసిన రైతులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఇప్పుడు రూ.12వేలు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ఇలా హామీలు ఇచ్చి అమలు చేయలేకపోతే రేవంత్‌రెడ్డి మాత్రమే వ్యక్తిగతంగా బాధ్యుడు కాదు, ఆ పార్టీ జాతీయ నాయకత్వం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదంటే తెలంగాణలోనే కాదు, మరే రాష్ట్రంలోనూ ప్రజలు ఆ పార్టీని నమ్మరు. అంతెందుకు మహారాష్ట్రలో కాంగ్రెస్ హామీలను ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణలో అమలు చేయని హామీలు తమకెందుకని అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. హామీల అమలుపై కంటే కక్ష రాజకీయాలపై దృష్టిపెడితే ఫలితాలు ఇలాగే ఉంటాయని గ్రహించిన ఆ పార్టీ మహారాష్ట్రలో కర్ణాటక, తెలంగాణ హామీల మాట ఎత్తొద్దని నాయకులకు నిర్దేశించింది. చివరికి కాంగ్రెస్ పార్టీ జరిపిన విజయోత్సవాలకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రావడానికి సుముఖత చూపలేదంటే రేవంత్ సారథ్యంలోని ఆ పార్టీ ఏ మేరకు విజయం సాధించిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కాలంలో అసలు తెలంగాణలో కనిపించదగిన మార్పేమీ రేవంత్‌రెడ్డి తీసుకురాలేకపోయారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న ఆయన ఏడాది గడుస్తున్నా ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏదైనా జాతీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మిగతా రాష్ట్రాల్లోనూ చెప్పుకొని ప్రచారం చేసుకుంటుంది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం ఆ పార్టీ జాతీయ నాయకత్వం చెప్పుకోవడానికి సంకోచిస్తున్నది. మామూలుగా కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులను మార్చే అలవాటు ఉన్నది. కానీ, ఎదురుచూసి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ దూకుడు మనస్తత్వం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. అధిష్ఠానం సూచనలను తెలంగాణ పాలకులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదన్న విమర్శలున్నాయి. మిగతా నాయకులతో అంటీముట్టనట్టు వ్యవహరించడం వల్ల ఆయనపై అధిష్ఠానం గతంలో సీరియస్ అయిన విషయం అందరికీ తెలిసిందే. రూ.15 వేల రైతు భరోసాపై వెనక్కి తగ్గడంపై క్యాబినెట్ సహచరుల సూచనలను ఆయన పట్టించుకున్నట్టు కనిపించలేదు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డికి ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు విశేష స్థాయిలో ఎందుకు ఉంటుందన్న విషయాన్ని గ్రహించడం లేదు. లగచర్ల సహా ప్రతిపక్షాలు చేసే ఏ పోరాటాలకైనా ప్రజలు భారీగా మద్దతునిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆమె అమలుచేసిన సం క్షేమ పథకాలా? లేదంటే ఆమె విధించిన ఎమర్జెన్సీ నా? అన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. తెలంగాణలో ఎలాగూ విశ్వాసం కోల్పోయింది. ఇప్పటికైనా తెలంగాణలోని నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం సరైన మార్గ నిర్దేశం చేయకపోతే మిగతా రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి అదే గతి పడు తుంది. ఇందులో అనుమానం లేదు.

మీ కాళ్లు బలహీనంగా ఉన్నాయా వీటిని తినండి.. దృఢంగా మారుతాయి

శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కొందరు శరీరం ఎంత దృఢంగా ఉన్నప్పటికీ కాళ్లు బలహీనంగా ఉంటాయి. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. అలాగే కండరాల నిర్మాణం కూడా సరిగ్గా ఉండదు. దీంతో పాదాల నొప్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆహారం తీసుకుంటే శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉండి కండరాల నిర్మాణం జరగాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. పలు ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కాళ్లను దృఢంగా ఉంచుకోవచ్చు. కాళ్లలో ఉండే కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

చికెన్..

చికెన్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. అయితే చికెన్‌లో లెగ్ పీస్‌లను తింటుంటారు. ప్రోటీన్లు కావాలంటే చికెన్ బ్రెస్ట్ పీస్‌లను తినాలి. లెగ్ పీస్‌లకు కొవ్వు బాగా ఉంటుంది. కనుక లెగ్ పీస్‌లను తినకూడదు. బ్రెస్ట్ పీస్‌లలో ప్రోటీన్లు ఉంటాయి. కనుక బ్రెస్ట్ పీస్‌లను తింటే కండరాలకు బలం కలుగుతుంది. ముఖ్యంగా కాళ్లలో ఉండే కండరాలు నిర్మాణం అవుతాయి. కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతోపాటు కండరాలకు బలం కలుగుతుంది. పెరుగును తింటున్నా కూడా కాళ్లు బలంగా మారుతాయి. ఆరోగ్యంగా ఉంటాయి. పెరుగులో ఉండే ప్రొబయోటిక్ ఆహారాలు, ప్రోటీన్లు కండరాలకు మేలు చేస్తాయి. కనుక పెరుగును రోజూ తినాలి.

పనీర్..

పనీర్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పనీర్ ద్వారా మనకు ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది. కాళ్లు బలహీనంగా ఉన్నవారు పనీర్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కాళ్లలోని కండరాలు దృఢంగా మారుతాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పాలకూరను తినడం వల్ల కూడా కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల శరీరానికి కావల్సిన క్యాల్షియం లభించడంతోపాటు ప్రోటీన్లు కూడా అందుతాయి. దీంతో కాళ్లు దృఢంగా మారుతాయి. అలాగే కాళ్లు బలంగా మారాలంటే చిలగడదుంపలను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ప్రోటీన్లను, శక్తిని అందిస్తాయి.

చియా విత్తనాలు..

ఇక సముద్రపు చేపలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఈ చేపలను తింటే మంచిది. దీంతో మన శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి ఎంతగానో దోహదం చేస్తాయి. దీంతో కాళ్లు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే క్వినోవాను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందిస్తాయి. కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ప్రోటీన్లను అందిస్తాయి. దీని వల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా చియా విత్తనాలను కూడా తినవచ్చు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కాళ్లను బలంగా మారుస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల కాళ్లు బలంగా మారుతాయి. శరీరానికి కూడా శక్తి లభిస్తుంది.

కెపిహెచ్బి ర్రోడ్ ఫేజ్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పుట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి రమేష్

కెపిహెచ్బి 6 ఫేజ్ లోని నేతాజీ గ్రౌండ్స్ లో ఎన్ ఎస్ జి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో టిపిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ పాల్గొని స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి ఉట్టి గొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువనేత మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నపిల్లలు శ్రీకృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, కే పి హెచ్ పి డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు కృష్ణ రాజపుత్, రామారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగమోహన్, మాకినేని వినోద్, మందలపు సాయిబాబా చౌదరి, గాదె శివ,లక్ష్మీనారాయణ,నవీన్,బచ్చు మల్లి మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.